# తేడా!

మల్లాది వెంకటకృష్ణమూర్తి

ఇరవై ఏళ్లు గవర్నమెంట్ కాలేజిలో లెక్చరర్‌గా పనిచేశాక భార్య ప్రోద్బలంతో ఓ స్వంత ఇల్లు కట్టుకోవాలన్న కోరిక కలిగింది సింహాచలానికి.

నాలుగైదు ఆదివారాలు బంధుమిత్రుల ఇళ్లకి వెళ్లి, వాళ్ల ఇళ్లల్లో ఏ అంశాలు బాగున్నాయో, ఏవి బాగోలేదే అనలైజ్ చేశాడు. ఆ ఐడియాలను ఇంజనీర్‌కిచ్చి ఇంటి ప్లాన్స్‌ని గీయించుకున్నాడు. ఓ శుభముహూర్తాన మునిసిపల్ ఆఫీసుకి వెళ్లాడు. తనొచ్చిన పని ప్యూన్‌తో చెప్తే ఎవరిని కలవాలో చెప్పాడా ప్యూన్.

ఆయన సీటు దగ్గరికి వెళ్లి తను వచ్చిన పని వివరించాడు.

"అయితే ఇంటికి ప్లాన్ గీయించారా?" అడిగాడా ఉద్యోగి.

సింహాచలం తలూపాడు.

"వెంట తెచ్చారా?"

సింహాచలం దాన్ని చూపించాడు. ఓ నాలుగైదు క్షణాలు దాన్ని పరిశీలించి, సంతకం చేసి చెప్పాడు.

"దాని జిరాక్స్ కాపీ ఒకటి తీసుకురండి!"

సింహాచలం అది తెచ్చాక ప్లాన్‌మీద - శాంక్షన్డ్ అని రాసి, జిరాక్స్ కాపీని తను ఫైల్లో వేసుకుని చెప్పాడు.

"మీరు ఇల్లు ఎప్పుడైనా మొదలుపెట్టుకోవచ్చు. మాకు అభ్యంతరం లేదు!"

సింహాచలం మంచి ముహూర్తం చూసుకుని పని మొదలుపెట్టాడు.

అతని పక్క స్థలం అతను ఓ రోజు సింహాచలాన్ని కలిసి చెప్పాడు.

"మీ పక్క సైటే నాది. నేనూ బడ్జెట్‌లోగా ఇల్లు మొదలుపెట్టాలని అనుకుంటున్నాను. మునిసిపాలిటీలో ఫార్మాలిటీస్ ఏమిటి?"

"పెద్దగా ఏం ఉండవు!" సింహాచలం ఏయే కాగితాలు తీసుకెళ్లాలో వివరించి, ఎవరిని కలవాలో కూడా చెప్పాడు. సింహాచలం పొరుగతను ఆ ప్రకారం ఇంజనీర్‌తో ఇంటి ప్లాన్ గీయించి, జిరాక్స్ కాపీ తీసుకుని మునిసిపాలిటీ ఆఫీసుకు వెళ్లాడు. ఆ ఉద్యోగిని కలిశాడు. ఆ ఉద్యోగి ఆ కాగితాలవంక చూడనైనా చూడకుండా డ్రాయర్లో పడేసుకుని చెప్పాడు-

"రెండు వారాల తర్వాత కనిపించండి!"

"అదేమిటీ? వెంటనే పర్మిషన్ ఇవ్వరా?" అడిగాడు అతను ఆశ్చర్యంగా.

"ఊహూ, మీ ప్లాన్ గవర్నమెంటు జి.వో. నిబంధనల ప్రకారం ఉందో లేదో, ఇంకా వాటర్ వర్క్స్, ఎలక్ట్రిసిటీ ఆఫీసు నిబంధనలకి, రోడ్డు నిబంధనలకి, లైబ్రరీ చట్టం నిబంధనలకి, పొల్యూషన్ బోర్డు నిబంధనలకి, పెట్రోల్ బంక్ యాక్ట్ నిబంధనలకి అనుగుణంగా ఉందో లేదో చూశాక, హౌసింగ్ బోర్డు నుంచి - నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తెస్తే అప్పుడు అనుమతి ఇస్తాం!"



"అదేమిటి? సరిగ్గా నెలక్రితం మా పక్కింటి సింహాచలానికి ఇవేమీ లేకుండానే ఇల్లు కట్టుకునేందుకు పర్మిషన్ ఇచ్చారుగా?" అడిగాడతను తెల్లబోతూ.

ఆ ఉద్యోగి మందహాసం చేసి చెప్పాడు "అప్పటికి ఈ ఆఫీసుకి ఐ.ఏ.ఎస్. ఆఫీసర్ పోస్ట్ లేదు. కొత్తగా ఆ పోస్ట్ శాంక్షన్ అయి. ఐ.ఏ.ఎస్. ఆఫీసరొచ్చాడిప్పుడు!" ■